క్లుప్తంగా

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌పై సమీక్ష

పాలకొండ: ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సక్రమంగా పూర్తి చేయాలని తహసీల్దార్ వరహాలు సూచించారు. మండలంలోని వీఆర్వోలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంతవరకు జరిగిన రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. ప్రతి గ్రామంలోను లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలందించాలని సూచించారు.

పరిశుభ్రత పాటించాలి



ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

పాలకొండ రూరల్: ప్రజలు అంటురోగాల బారిన పడకుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని అట్టలి సర్పంచ్ కె.సంధ్యారాణి పిలుపునిచ్చారు. గ్రామంలో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఫాగింగ్ యంత్రం సాయంతో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.


గిరిజన స్పందనకు 126 వినతులు



పీఓకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

సీతంపేట: ఐటీడీఏలో ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 126 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెచ్‌ఎం ప్రమోషన్లు ఇవ్వాలని, సవర భాషా వలంటీర్లను కొనసాగించాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు ఎస్.మురళీమోహన్‌రావు, కె.కృష్ణారావు వినతిపత్రం అందజేశారు. దీనిపై పీఓ సానుకూలంగా స్పందించారు. అంగన్‌వాడీ కేంద్రం ఆంపురం గ్రామస్తులు, వరద గోడ నిర్మించాలని చింతగూడ గ్రామానికి చెందిన కృష్ణారావు, బెన్నడుగూడలో సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎస్.లక్ష్మీనారాయణ, పాండ్రచీడిమాను గూడలో సామాజిక భవనం ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన గిరిజనులు వినతులు అందజేశారు. చీపుర్ల తయారీ యూనిట్ మంజూరు చేయాలని బొడ్డగూడకు చెందిన ఆరిక కమల, కుట్టుమిషన్ మంజూరు చేయాలని జామిగూడకు చెందిన కుమారి స్పందనలో దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పీఏఓ హరికృష్ణ, పీహెచ్ఓ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విరిగిపడిన అంబేడ్కర్ విగ్రహం



వాహనం ఢీకొనడంతో నేలకొరిగిన అంబేడ్కర్ విగ్రహం

భామిని: భారీ వాహనం ఢీకొనడంతో మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నేలకొరిగింది. సోమవారం కొత్తూరు వైపు నుంచి బత్తిలి వైపు వస్తున్న భారీ వాహనం రోడ్డు మధ్యన ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని తాకడంతో విగ్రహం విరిగిపడింది. దీంతో స్థానికులు, అంబేడ్కర్ యూత్ నాయకులు వాహనాన్ని అడ్డుకుని ఆందోళన చేపట్టారు. ఇరుకు రోడ్డులో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పరిస్థితి విషమించకుండా బత్తిలి పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

మక్కువ: మండల కేంద్రం మక్కువ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ పి.దేవకుమార్ సోమవారం పరిశీలించారు. వేతనదారుల మస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కొలతల మేరకు పనులు పూర్తిచేస్తే గిట్టుబాటు వేతనం లభిస్తుందన్నారు. ఎండలు పెరుగుతున్నందున మంచినీటిని వెంట తెచ్చుకోవాలని సూచించారు.

జనరిక్ మెడికల్ షాపు ప్రారంభం

పార్వతీపురం టౌన్: పీఏసీఎస్ ఆధ్వర్యంలో స్థానిక రాయగడ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాన్ని (జనరిక్ మెడికల్ షాప్) ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల, పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అంపిలి అదుర్స్



సర్వాంగ సుందరంగా తీర్చదిద్దిన ప్రభుత్వ పాఠశాల

- టీడీపీ హయాంలో అంకెల గారడీ
- వైఎస్సార్‌సీపీలో చేరువైన సంక్షేమ ఫలాలు



పాలకొండ రూరల్: గ్రామ స్వరాజ్యం పల్లెల్లో అభివృద్ధి కనిపించినప్పుడే సిద్ధిస్తుందన్న మేధావుల మాటలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తూచా తప్పక పాటిస్తోంది. గత ప్రభుత్వాలు గ్రామాల అభ్యున్నతికి రూ.కోట్లలో నిధులు కేటాయించామని అంకెల గారడీ చేస్తే.. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తాము అధికారంలోకి వచ్చిన అనతికాలంలో చేసిన అభివృద్ధి నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి పల్లె ప్రగతిని చూద్దాం అంటుంది. డివిజన్ కేంద్రానికి కేవలం 3 కిలోమీటర్ల దూరంలో పవిత్ర నాగావళి నదీతీరాన్ని అనుకుని ఉన్న అంపిలి గ్రామంలో ప్రస్తుతం ఎక్కడ చూసినా జగనన్న సర్కారు మార్కు కనిపిస్తోంది. 1453 మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో 723 మంది పురుషులు, 735 మంది మహిళలు ఉన్నారు. వారిలో 1124 మంది ఓటు హక్కు కలిగి ఉండగా అందులో స్త్రీలు 584, పురుషులు 540 మంది ఉన్నారు. గత టీడీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని ఈ గ్రామంలో మౌలిక వసతులు మొదలుకుని బడి, సచివాలయం, రైతుభరోసా, వెల్‌నెస్ కేంద్రాలు, శీతలపాల కేంద్రం.. ఇలా పక్కా భవనాలు కొలువుతీరాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టకుని గ్రామస్తులు తమ ప్రాంతంలో నాలుగున్నరేళ్లలో ప్రత్యక్షంగా కనిపిస్తున్న అభివృద్ధిని కొనియాడుతున్నారు. కేవలం పంచాయతీకే పరిమితమైన గ్రామంలో అనేక ప్రభుత్వ కార్యాలయాలు, అందులో తమ, బంధువుల పిల్లలే ఉద్యోగులుగా సేవలు అందిస్తుంటం చూసి ఇదికదా అభివృద్ధి అంటూ చర్చించుకుంటున్నారు.

జగనన్న హయాంలో ప్రత్యక్ష అభివృద్ధి..

- గ్రామ ప్రజలకు స్థానికంగా సేవలు అందించేందుకు దాదాపు రూ.40 లక్షలతో గ్రామ సచివాలయాన్ని, రూ.21.80 లక్షలతో రైతుభరోసా కేంద్రాన్ని నిర్మించారు. పాడిరైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రూ.15.74 లక్షలతో పాలశీతల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



పాలశీతల కేంద్రం

- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో దుర్భరంగా మారిన సీసీ రహదారుల పునరుద్ధరణకు రూ.2.70 లక్షల ఖర్చుతో సీసీ రహదారులు నిర్మించారు.
- మనబడి నాడు-నేడు కింద గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలకు దీటుగా తీర్చిదిద్దింది. దీని కోసం తొలి విడతలో రూ.23 లక్షలు, రెండో విడతలో రూ.9 లక్షలు ఖర్చుచేశారు. ఇంకా రూ.51 లక్షలతో అదనపు భవనాల నిర్మాణం చేయాల్సి ఉంది.
- స్థానిక వేతనదారులకు ఉపాధి కల్పించే క్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.36 లక్షలతో డ్రైనేజీల ఏర్పాటుకు నిశ్చయించారు. ఇప్పటికే రూ.16 లక్షలతో వీధి కాలువలు, వాటిపై సిమెంట్ పలకలను సిద్ధం చేస్తున్నారు.



: రైతుభరోసా కేంద్రం

- జలజీవన్ మిషన్ కింద రూ.12 లక్షలతో ఇంటింటి కుళాయి పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే గ్రామంలో 98 శాతం పనులు పూర్తిచేశారు. త్వరలో ప్రతీ ఇంటికి తాగునీరు అందించనున్నారు.

వైఎస్సార్‌సీపీ అందించిన ప్రత్యక్ష, పరోక్ష సంక్షేమం ఇలా..

కేవలం అభివృద్ధికే కాకుండా ప్రజలకు నవరత్నాల పేరిట సచివాలయ పరిధిలోని అంపిలి, అన్నవరం గ్రామాల్లో అర్హులకు సంక్షేమ ఫలాలను అందించటం జరిగింది. డీబీటీ విధానంలో రూ.11,30,93,380 లబ్దిదాలకు బ్యాంక్ ఖాతాల్లో జమచేటం జరిగింది. పరోక్షంగా ఇళ్ల స్థలాలు 43 మందికి సంబంధించి భూ సేకరణకు, 184 మందికి విద్యాకానుక అందించేందుకు, 8వ తరగతి చదువుతున్న 18 మంది విద్యార్థులకు ట్యాబ్‌ల కోసం, 190 మంది విద్యార్థులకు గోరుముద్ద, 81 మందికి జగనన్న తోడు రుణాలు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ 174 మందికి, 546 మందికి రేషన్ అందించే క్రమంలో రూ.3,06,99 వేలు ఖర్చు చేశారు.

పథకం	లబ్ధిదారులు	చెల్లించిన మొత్తం (రూ.)
జగనన్న అమ్మఒడి	283	1,31,16,510
జగనన్న విద్యాదీవెన	244	67,56,590
జగనన్న వసతిదీవెన	185	33,54,321
వైఎస్సార్ రైతు భరోసా	400	1,89,62,400
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	38	9,91,775
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు(రైతులకు)	226	6,87,564
రైతు ఇన్‌పుట్ సబ్సిడీ	1	9,750
వైఎస్సార్ పెన్షన్ కానుక	426	4,13,97,750
వైఎస్సార్ చేయూత	184	8,06,2500
వైఎస్సార్ ఆసరా	528	1,06,79,400
వైఎస్సార్ సున్నా వడ్డీ (ఎస్‌హెచ్‌జీలకు)	650	11,26,820
వైఎస్సార్ కాపునేస్తం	4	1,50,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	3	90,000
వైఎస్సార్ కళ్యాణమస్తు/ షాదీతోఫా	3	1,50,000
డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	134	45,83,203
డా.వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	96	5,61,450
హౌసింగ్ (లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు)	11	7,30,670
వైఎస్సార్ బీమా	4	4,60,000
వైఎస్సార్ వాహనమిత్ర	13	3,80,000
జగనన్న చేదోడు (రజకులు, నాయీబ్రహ్మణులు, టైలర్లు)	6	1,20,000
కోవిడ్ ప్రత్యేక సహాయం (తెల్ల రేషన్ కార్డుదారులకు)	702	7,02,000
జగనన్న తోడు(వడ్డీ)	70	20,677

కళ్ల ముందు కనిపిస్తోంది..



జగనన్న పాలనలో గ్రామంలో కనీవినీ ఎరుగని అభివృద్ధి ప్రత్యక్షంగా కనిపిస్తోంది. దీన్ని ఎవరూ కాదనలేరు. అంతేకాదు మా సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు రూ.14.37 కోట్ల మేర లబ్ధి జరిగింది. ప్రభుత్వ పాఠశాల ఎంతో సౌకర్యవంతగా మారిపోయింది. నాతో పాటు అనేక మంది అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందటంతో మా జీవన స్థితిగతులు మెరుగుపడ్డాయి. సచివాలయ పాలనతో ప్రభుత్వమే మా గ్రామంలో ఉన్నట్లు ఉంది.

– మజ్జి దుర్గారావు, రైతు, అంపిలి గ్రామస్తుడు



అంపిలి గ్రామ సచివాలయ నతన భవనం

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి

- మండల సమావేశంలో ఎంపీపీ దీనమయ్య



మాట్లాడుతున్న ఎంపీపీ కుంబురుక దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: మండల పరిషత్ సమావేశాలు ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక అని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలు సభ్యులకు చదివి వినిపించారు. మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. భద్రగిరి సీహెచ్‌సీలో మినీ బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయాలని, సీహెచ్‌సీ నుంచి రిఫరల్ కేసుల సంఖ్య తగ్గించి, సాధ్యమైనంత వరకు స్థానికంగానే వైద్య సేవలను అందివ్వాలన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా ప్రతీ నెలా బియ్యం మాత్రమే ఇస్తున్నారని, పప్పు, పంచదార వంటి నిత్యావసర సరుకులు ఇవ్వడం లేదని, బయోమెట్రిక్ వేయిస్తున్నప్పటికీ ఏ నెలకానెల బియ్యం ఇవ్వడం లేదని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే జీసీసీ, వైకేపీ, వీడీవీకేల ద్వారా జీడి పిక్కలను కిలో రూ.200లు చొప్పున, పిక్కతో ఉన్న చింతపండు కిలో రూ.60, పిక్క తీసిన చింతపండు కిలో రూ.120 చొప్పున కొనుగోలు చేయాలని కోరారు. మూతపడిన పి.ఆమిటి, దుమ్మంగి, బొద్దిడి గ్రామాల్లోని ద్రవ్య సహాయక పాఠశాలలను వచ్చే విద్యాసంవత్సరం నుంచి పునఃప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎంఈఓ బి.చంద్రశేఖర్ తెలిపారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా కోళ్లు, మేకలు, గొర్రెల పెంపకంపై ఆసక్తి కనబరిచే లబ్ధిదారులకు రూ.50 శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు చేయనున్నట్లు వైకేపీ ఏపీఎం తెలిపారు. అలాగే పిండి మిల్లులు పెట్టుకునేందుకు ఆసక్తి కలిగిన లబ్దిదారులు తమను సంప్రదించాలని ఏఓ సీహెచ్ ప్రసాద్ కోరారు. భద్రగిరి సీహెచ్‌సీ వైద్యాధికారిని త్రివేణి మాట్లాడుతూ.. గుండె రోగుల కోసం స్టేమీ ప్రోగ్రాంను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని, రోగులు సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, ఎంపీడీఓ జి.జగదీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 42 మంది తరలింపు



కంటి శస్త్రచికిత్సలకు వెళుతున్న వృద్ధులు

కురుపాం: కంటి ఆపరేషన్ల కోసం 42 మంది వృద్ధులను ఎంపిక చేసినట్లు మన్యం జిల్లా కంటి వెలుగు నేత్రవైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి సోమవారం తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష, కంటివెలుగు శిబిరాల్లో నేత్ర సమస్యలైన అంతర కుసుమం, కొయ్యకాండతో ఇబ్బంది పడుతున్న 42 మంది వృద్ధులను గుర్తించినట్లు చెప్పారు. వారికి కంటి ఆపరేషన్ చేసేందుకు గాను ప్రత్యేక బస్సులో తగరపువలసలోని ఎన్ఆర్ఐ కంటి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఉచిత భోజన, వసతి, రవాణ సదుపాయం కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నేత్ర వైద్య సహాయకులు మాలిక, రోజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారుల పనితీరుపై ఎంపీపీ అసంతృప్తి



వైద్యారోగ్య శాఖ సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ఎంపీపీ శెట్టి పద్మావతి

కురుపాం: వైద్యారోగ్యశాఖ, వ్యవసాయశాఖ సిబ్బంది పనితీరుపై ఎంపీపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అప్పారావు ఆధ్వర్యంలో ఎంపీపీ శెట్టి పద్మావతి అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులపై సభ్యులు చర్చించారు. వైద్యారోగ్య శాఖపై చర్చ సందర్భంగా మెండెంఖల్ పీహెచ్‌సీ వైద్యాధికారి, సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు గైర్హాజరుపై ఎంపీపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారులు కాకుండా క్షేత్రస్థాయి సిబ్బంది రావడంతో మీరెందుకొచ్చారని ప్రశ్నించారు. అనంతరం వ్యవసాయశాఖపై జరిగిన చర్చ సందర్భంగా రైతు భరోసా కేంద్రాల సమాచారం, విత్తనాల సమాచారాన్ని ఎప్పికప్పుడు రైతులకు తెలియజేయకపోవడంపై ఏఓ నాగేశ్వరరావు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల స్థాయి సమావేశాలకు మండలంలోని అధికారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని, క్షేత్రస్థాయి సిబ్బందిని సమావేశాలకు పంపితే ప్రయోజనం ఉండదని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ గొర్లి సుజాత, వైస్ ఎంపీపీలు రంగారావు, బిడ్డిక అన్నాజీరావు, ఎంపీటీసీలు వెలమల బంగారునాయుడు, టి.వి.ఎస్.స్వామియాజులు, గౌడు సంతోషిరాణి, ఊటక కృష్ణకుమారి, గుడారి విద్యారాణి, సునీత, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి



ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐ శివకుమార్

సీతానగరం: వాహనదారులు రహదారి భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పార్వతీపురం మనం జిల్లా ఎంవీఐ ఎం. శివకుమార్ అన్నారు. రవాణా భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని సీతానగరం హనుమాన్ జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ల యజమానులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎంవీఐలు ఎన్. రమేష్‌కుమార్, జి. సత్యనారాయణతో కలిసి ఆయన మాట్లాడుతూ, వాహనాలు తీసే ముందు వాటి కండీషన్ తెలుసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని.. కారు డ్రైవింగ్ చేసేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అనంతరం నిబంధనలు పాటిస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో చినబోగిలి, సీతానగరం, అజ్జాడ గ్రామాలకు చెందిన డ్రైవర్లు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలి

గరుగుబిల్లి: రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వైద్యసిబ్బంది, స్త్రీ,శిశు సంక్షేమశాఖ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. రక్తహీనత నివారణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందన్నారు. సమన్వయంతో ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలకు విధిగా అందజేయాలన్నారు. నులిపురుగుల నివారణకు పంపిణీ చేస్తున్న అల్బెండజోల్ మాత్రలు 19ఏళ్ల లోపు పిల్లలతో వేయించాలని సూచించారు.

తప్పుడు బిల్లులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి



దోకులగూడ గిరిజనులతో కలిసి మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

భామిని: దోకులగూడ రోడ్డు నిర్మాణానికి రాళ్ల బ్లాస్టింగ్ కోసమని తప్పుడు బిల్లులు పెట్టిన ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ కార్యదర్శి కూరంగి మన్మథరావు, మండల అధ్యక్షుడు గుజ్జి జనార్దనరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కోరంగి గోపినాయుడు డిమాండ్ చేశారు. దోకులగూడ రోడ్డు నిర్మాణ పనులను గిరిజనులతో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దోకులగూడ రోడ్డు నిర్మాణానికి ఉపాధిహామీ నిధుల నుంచి రూ.2 కోట్లు మంజూరు కాగా, పూర్తిస్థాయిలో పనులు చేపట్టకుండానే కొండ మీద బ్లాస్టింగ్ చేపట్టే నెపంతో ఇంజినీరింగ్ అధికారులు రూ.3.50 లక్షలు బిల్లులు పెట్టారని ఆరోపించారు. దోకులగూడ గ్రామస్తులు ఐటీడీఏ పీఓకు ఫిర్యాదు చేయడంతో ఇంజినీరింగ్ అధికారుల అక్రమాలు బయటపడ్డాయన్నారు. అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నేర నియంత్రణకు సహకరించండి

పార్వతీపురం టౌన్: నేరాల అదుపునకు సహకరించాలని సీసీఎస్ సీఐలు ఎం. అప్పారావు, సుధాకర్ కోరారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రైవేట్ కల్యాణ మంటపంలో జ్యువెలరీ షాపు యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దుకాణాల్లో నైట్‌విజన్ సీసీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలని కోరారు. దొంగ బంగారం, వెండి వస్తువులు కొనుగోలు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో సీసీఎస్ ఎస్సైలు రమణారావు, రమణారెడ్డి, పార్వతీపురం టౌన్ ఎస్సైలు సంతోషి, రవీంద్రరాజు, బంగారు దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటలు ఆరోగ్యకరం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందజేస్తున్న ఎంపీపీ దీనమయ్య, జెడ్పీటీసీ రాధిక

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన పంటలు ఆరోగ్యానికి మంచివని ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది సోమవారం ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన కూరగాయలను విక్రయించారు. ఈ స్టాల్‌ను ఎంపీపీ, జెడ్పీటీసీ సందర్శించారు. రసాయన ఎరువులతో పండించిన పంటలతో ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన పంటలను వినియోగించడం వల్ల ఆరోగ్యానికి మేలు జరగడంతో పాటు రైతులను ప్రోత్సహించినట్లవుతుందన్నారు. మండల సమావేశానికి హాజరైన పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు ఈ స్టాల్‌ను సందర్శించి కూరగాయలను కొనుగోలు చేశారు. ఏపీసీఎన్ఎఫ్ క్లస్టర్ కోఆర్డినేటర్ కిమిడి భూషణరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

రంగంవలస పరిసరాల్లో ఏనుగులు



రంగంవలస పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగులు

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని ఎత్తైన కొండలపై ఉన్న రంగంవలస గ్రామ పరిసరాల్లో నాలుగు ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. జీడి,మామిడి, అరటి తోటలను నాశనం చేస్తున్నాయని గిరిజనులు వాపోతున్నారు. రాత్రి సమయంలో పెద్దపెద్దగా ఘీంకరిస్తుండడంతో కంటిమీద కునుకు ఉండడం లేదన్నారు. గిరిజనుల జీవనాధారమైన పంటలు నాశనం కావడంతో భవిష్యత్‌లో ఇబ్బందులు పడతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖాధికారుల నుంచి ఎటువంటి నష్టపరిహారం అందడం లేదని, పంటనష్టం కూడా అంచనా వేయడం లేదని గిరిజన రైతులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఏనుగులను తరలించి పంటనష్టపరిహారం మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంఓ జగన్మోహనరావు

గరుగుబిల్లి: ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని డీఎంఓ డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని ఉద్దవోలు గ్రామంలో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రంను ఆయన పరిశీలించారు. ఓపీ రికార్డును పరిశీలించి రోగులకు అందుతున్న సేవలు, వారికి అందించిన చికిత్స, మందుల వివరాలను తనిఖీ చేశారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సిబ్బందికి సూచించారు. హిమోగ్లోబిన్ శాతం తరుచూ తక్కువగా ఉంటున్న మహిళలకు సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి కేకే సాగర్‌వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

భారత్ బంద్ జయప్రదం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

భామిని: ఈ నెల 16న దేశవ్యాప్తంగా తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌లో కార్మికులు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని సంయుక్త కిషాన్ మోర్చా, కార్మిక సంఘాల జేఏసీ ఉమ్మడిగా సోమవారం పిలుపునిచ్చాయి. పాలకొండలో సోమవారం కార్మిక సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ మండల సమన్వయ కమిటీ కార్యదర్శి కాదా రాము, రైస్ మిల్లు వర్కర్స్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ మతతత్వ విధానాలను దుయ్యబట్టారు. బంద్‌లో తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.